# బీటీ రోడ్లతో తండాలకు మహర్దశ

**● ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చొరవతో రూ.2.80 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం ● 8 నెలల్లో పనులు పూర్తి**

నర్సాపూర్, అక్టోబర్12: పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అందరికీ అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ప్రతి గ్రామానికి, గిరిజన తండాలకు రోడ్డు నిర్మాణాలు చేపడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి మన్ననలను పొందుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూరా మండలం దౌలాపూర్ గ్రామం నుంచి నర్సాపూర్ మండలం కోక్యాతండా వరకు సరైన రోడ్డు లేక వాహనదారులు, తండావాసులు నానా ఇబ్బందులకు గురయ్యారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి రూ.2.80 కోట్ల నిధులను పీఎంజీఎస్‌వై నుంచి మంజూరు చేయించారు. నిధులు మంజూరు కాగానే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి కేవలం 8 నెలల్లోనే పనులు పూర్తి చేశారు. ఈ రోడ్డు నిర్మాణం 7 కిలోమీటర్లు వేయాల్సి ఉండగా 5 కి.మీ వరకు వేశారు. ఈ వర్షాకాలం పూర్తి కాగానే మిగతా 2 కి.మీ రోడ్డు నిర్మాణం చేపడతామని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో దౌలాపూర్, మూసాపేట్, జైరామ్‌తాండా, ఎల్లారెడ్డిగూడాతాండా, కోక్యాతండా వాసులకు లబ్ధి చేకూరింది. గతంలో గుంతల రోడ్డు ప్రయాణం ఇబ్బందిగా ఉండేదని నేడు ప్రయాణం సాఫీగా ఉందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాలతో తాండాలకు మహర్దశ వచ్చిందని, అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి గ్రామస్తులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



దౌలాపూర్ నుంచి కోక్యాతండా వరకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

### ప్రజలకు తీరిన ఇక్కట్లు..



గతంలో సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి కేవలం 8 నెలల్లోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో గ్రామాల్లో, గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడంతో గ్రామాలు, తండాలు కొత్త కళను సంతరించుకున్నాయి. గిరిజన తండాల అభివృద్ధి కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యపడుతున్నది. మళ్లీ గిరిజనులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించి ముచ్చటగా మూడోసారి సీఎం చేయాలి కోరారు. **– మదన్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే**

### ప్రయాణం సాఫీగా..

గతంలో ఇంటి నుంచి నర్సాపూర్ వెళ్లాలంటే అరగంట పట్టేది. నేడు 5 నిమిషాల్లో నర్సాపూర్ చేరుకుంటున్నామని ఎల్లారెడ్డిగూడా తండాకు చెందిన ఉమ్లా హర్షం వ్యక్తం చేశాడు. ఇటీవలే బీటీ రోడ్డు నిర్మించడంతో ప్రయాణం సాఫీగా సాగుతుంది. మారుమూలన ఉన్న గిరిజన తండాలకు నేడు బీటీ రోడ్డుతో కొత్త కల సంతరించుకుందని తండావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



దివ్యాంగులు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన వీల్‌చైర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ ఎన్నికల అధికారి

## దివ్యాంగులకు వీల్ చైర్లు సిద్ధం

**● రామాయంపేట మున్సిపల్ ఎన్నికల అధికారి ఉమాదేవి**

రామాయంపేట, అక్టోబర్ 12: వచ్చే నెల నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు రామాయంపేట మున్సిపల్ ఎన్నికల అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. గురువారం రామాయంపేట మున్సిపల్‌కు చేరుకున్న దివ్యాంగుల వీల్‌చైర్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఉమాదేవి మాట్లాడుతూ ఓటు వేయడం కోసం ఎలాంటి వారైనా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు అన్ని రకాలుగా వీల్ చైర్లను సిద్ధం చేసి ఉంచామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రజలు తమకు ఎక్కడైతే పోలింగ్ బూత్‌లో పేరు వచ్చిందో అక్కడికే నేరుగా వెళ్లాలన్నారు. వెళ్లలేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ప్రభుత్వం సమకూర్చిన వీల్‌చైర్లు, వివిధ రకాల వాహనాలను సిద్ధంగా చేశామని ఆమె వెల్లడించారు.




మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

## క్రీడలతో మంచి స్నేహభావం

శివ్వంపేట, అక్టోబర్ 12: క్రీడలతో క్రీడాకారుల మధ్య మంచి స్నేహభావం పెరుగుతుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం శివ్వంపేట మండలం గోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 వాలీబాల్ పోటీలను డీఈఓ రాధాకిషన్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని, క్రీడల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ రమేశ్ గంగాల, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుపై దాడి.. మద్యం పట్టివేత

చిలిపిచెడ్, అక్టోబర్ 12: మండలంలోని గౌతాపూర్‌లో బెల్ట్ షాపుపై పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.23వేల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## 'గృహలక్ష్మి' వర్తింపచేయాలి



వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

నిజాంపేట, అక్టోబర్ 12: ఎన్‌హెచ్ 765 డీజీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇండ్లను కోల్పోయిన తమను ఆదుకోవాలని నిజాంపేటకు చెందిన తిరునహరి లత,యాదమ్మ గురువారం తహసీల్ కార్యాలయంలో అధికారులను ఆశ్రయించారు. తమకు గృహలక్ష్మీ పథకంను వర్తింపు చేయాలని కోరుతూ బాధితులు ఆర్ఐ గంగాధర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.



## వృద్ధాశ్రమంలో అన్నదానం

నర్సాపూర్, అక్టోబర్ 12: పట్టణంలోని 'విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్'లో గురువారం పలువురు దాతలు వృద్ధులకు అన్నదానం చేశారు. దాత శ్రీనివాస్ తన భార్య భాగ్య పుట్టినరోజును పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి పండ్లను పంచిపెట్టారు. ఈ సందర్బంగా 'విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్' ప్రతినిధి అపర్ణ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, అన్నదానం చేసిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



శంశిరెడ్డిపల్లితండాలో తనిఖీల్లో పాల్గొన్న ఎక్సైజ్ సీఐ జయసుధ, సిబ్బంది

## అక్రమ మద్యం నిల్వలపై ముమ్మర తనిఖీలు

**● రామాయంపేట ఎక్సైజ్ సీఐ జయసుధ**

వెల్దుర్తి, అక్టోబర్ 12: ఎన్నికల విధుల్లో భాగంగా గురువారం వెల్దుర్తి మండలంలోని పలు గిరిజన తండాలు, అనుమానిత స్థలాల్లో తనిఖీలు నిర్వహించినట్లు రామాయంపేట ఎక్సైజ్ సీఐ జయసుధ తెలిపారు. మండలంలోని శంశిరెడ్డిపల్లితండా, చర్లపల్లితండా, మహ్మద్‌నగర్‌తండాలతో పాటు పలు గ్రామాలలోని కోళ్లఫాంలు, ఫాంహౌస్‌లు, వ్యవసాయ పొలాల్లోని నిర్మాణాల్లో, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.ఈ తనిఖీల్లో ఎలాంటి అక్రమ మద్యం నిల్వలు కాని, అనుమానాస్పద మత్తు పదార్థాలు కాని లభించలేదన్నారు. అనంతరం సీఐ జయసుధ మాట్లాడుతూ ఎవరు కూడా ప్రైవేటు స్థలాల్లో అక్రమంగా మద్యాన్ని కాని, ఇతర మత్తు పదార్థాలను కాని నిలువ చేయరాదని, అలాగే క్రయ, విక్రయాలు చేయరాదన్నారు. అక్రమ మద్యం, మత్తు పదార్థాలు నిల్వ ఉంటే తమకు సమాచారం అందించాలని, నిల్వ చేసిన వ్యక్తులపై కేసులు నమోదు, కఠిన చర్యలు తీసుకుంటానని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ నరేందర్, ఎస్సై విజయ్‌సిద్దార్థ, హెడ్ కానిస్టేబుల్ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

## సరైన పత్రాలు లేకుంటే డబ్బులు సీజ్

**● తనిఖీలో రూ.లక్ష నగదు లభ్యం: ఎస్సై రంజిత్**

రామాయంపేట, అక్టోబర్ 12: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వాహనంలో రూ.50వేల పైగా ఉంటే వాటికి సరిపడా పత్రాలు చూపాలని, లేకుంటే ఆ డబ్బులను సీజ్ చేసి జిల్లా అధికారులకు చేరవేయడం జరుగుతుందని రామాయంపేట ఎస్సై రంజిత్ పేర్కొన్నారు. గురువారం వాహన తనిఖీల్లో భాగంగా అక్కన్నపేట శివారులో అక్కన్నపేటకి చెందిన శంభుగల్ల దుర్గయ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.లక్ష నగదు లభించినట్లు తెలిపారు. లభించిన నగదుకు పత్రాలు లేనందున ఎలక్షన్ నిబంధనల ప్రకారం రూ.లక్షను సీజ్ చేసి జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. రూ.50వేల వరకు ఎలాంటి పత్రాలు అవసరం లేదని, రూ.50 వేల పైబడి ఉండి సరైన పత్రాలు చూపకపోతే డబ్బులను సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన డబ్బులకు సరైన పత్రాలు చూపితే మళ్లీ తమ డబ్బులు తీసుకువెళ్లవచ్చని సూచించారు.



అక్కన్నపేటలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

## కాలువలో పడి వ్యక్తి మృతి



కాట్రోత్ రవి (ఫైల్)

నర్సాపూర్, అక్టోబర్ 12: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఖాజీపేట్ గ్రామం రాంసింగ్ తండాలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఖాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంసింగ్ తండాకు చెందిన కాట్రోత్ రవి (38) వ్యవసాయం చేస్తు జీవిస్తున్నాడు. గురువారం ఉదయం కాలకృత్యాలకు ఇంట్లోంచి బయలుదేరాడు. గ్రామ సమీపంలోని కాళేశ్వరం కాలువ కోసం చేపడుతున్న కాలువలోకి దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ హేమలతామదన్‌మోహన్ కోరారు.

## ఎన్నికల నియమావళిని పాటించాలి

కొల్చారం, అక్టోబర్ 12: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించి, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ తెలిపారు. కొల్చారం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకువెళ్తే సీజ్ చేస్తామన్నారు.